మాతాపుత్ర ప్రహసనము

శ్రీమతి సుసర్ల లక్ష్మీనరసమాంబగారు

కామాక్షమ్మ వంటచేస్తూ 'బ్రహ్మం!' అనిపిల్చింది-పైమీద గుడ్డవేసుకుని యెక్కడకో వెళ్లాలనుకుంటూవున్న బ్రహ్మం ఆపిలుపుతో వంటయింట్లోకి వచ్చాడు. 'రా కూర్చో యెక్కడికీ వెడుతున్నావు?' అంది కామాక్షమ్మ. 'యెందుకుపిల్చావ్' అన్నాడు బ్రహ్మం.

కా:—నిన్నా, మాట్లాడాలని పిల్చాను. నీపెళ్లామేదీ?

బ్ర:—దొడ్డికివెళ్ళిందికాబోలు, యెందుకు?

కా:—అచ్చేనాకెందుకు? పనిచెయ్యినా పాటచెయ్యినా? పూరికేఅడిగాను దాని నడతేమీబాగాలేదు. నీతో కాస్త చెపుదామనేపిల్చాను. నేను చెప్పితే బొత్తిగావినదు.

బ్ర:—ఏంచేసిందేమి? చెప్పు చంపేస్తా.

కా:—ఏంచేసేదేమిటి? ఏమన్నాఅంటే అత్తగారు కోడంత్రికముపెట్టింది అంటుంది. మధ్యనిష్ఠూరం నాకు. మీరూ మీరు బాగానేవుంటారు. నువ్వులు నూనె పక్కటే తెలుకులాడే వేరుగాని.

బ్ర:—ఏంచేసిందోచెప్పు డొక్కచీరేస్తా.

కా:—ఆ! చీరావులే. ఆ తెలివితేటలు నీదగ్గరవుంటే అది యిల్లాయెందుకుంటుంది? నీకంట్లో కాయిఅనీ, నీవు అందమైనవాడవుకావనీ, అప్రయోజకుడవనీ, అమాయకుడవనీ కీలుబొమ్మనాడించినట్లు ఆడించేస్తోంది. నీకు తెలియడంలేదుకాబోలు.

బ్ర:—అది చేసేపనులు అన్నీ చెప్పు. ఈవాళ నా మజాకాచూడు.

కా:—ఏమిచెప్పను? మాలకూడు యింట్లోకలుస్తోంది. మడికట్టుకుని అన్నంతినమంటే తినదు. చాకలిది తెచ్చినబట్టే శుభ్రంగావుంటుందిట. విన్నావా? మొన్నవైద్యుడు చేయిచూస్తే ఆబట్టతో యిల్లంతా ముట్టుకుందిగదా, డాక్టరు బ్రాహ్మడైతేమాత్రమేమి? వాడెంతమందిముట్టువాళ్లని, బాలింతవాళ్ళనీ, చూసివస్తాడో! గాజులు మనకి పనికిరావేఅంటే వినక మొన్నగాజులు వేయించుకుందిగదా పైగా గాజులసెట్టిని ముట్టుకుందిగదా స్నానమేనాచెయ్యిలేదు. ఇట్లాఅయితే యెల్లాచెప్పు, నాయనా! అంటే కోపంవస్తుందిగాని మడీఆచారం అసలేలేదు సరిగదా ప్రొద్దున్నే కాఫీ అలవాటుగదా. అది లేకపోతే వుండలేదట. విన్నావా? కాళ్లుతీపులట, కడుపుమంటలు, తలనొప్పిట. ఏకాదశీలేదు, అమావాశ్యలేదు, పండగలేదు, పర్వములేదు. దిక్కుమాలినసంత. ప్రొద్దున్నే త్రాగికూర్చుంటుంది. దీనికాఫీతగలెయ్య. డబ్బుఅంతా దీనికోసమే అయిపోతోంది. ఎక్కడనుంచివస్తోందో యేమీఅక్కర లేదుగదా, నన్నుగానట్టు పూరుకుంటుంది. ఆకాఫీ నేతెచ్చియియ్యనంటే నిన్ను చంపేస్తుందేమిటి? నీవు అనవుగాని. నాకెందుకులే అయినా మీరూ మీరూవకటే. నీవుకూడా అలవాటు చేసికున్నావు గదా ఆపాడుకాఫీ.

బ్ర:—సంగతంతా విన్నానుగా, దానిపనిచేస్తానుగా.

కా:—అందుకనేపిల్చాను. (కళ్లనీళ్లుపెట్టుకుంటూ) చిన్నప్పటినుంచీ అష్టకష్టాలుపడి పెంచి పెద్దచేసి యీదౌర్భాగ్యురాలిచేతిలో పెట్టేను. అది వచ్చినతర్వాతే నాయింటికి లక్ష్మితొలగింది. ఆమారాజు చచ్చి స్వర్గాన్నున్నారు. ఆయిన చెప్పనేచెప్పేరు యీపిల్ల మనకత్తులోకలవదని. నీవంటే ఆపేక్ష, గౌరవం లేనేలేదు దానికి. నేచస్తే అన్నమేనాపెడుతుందో పెట్టదో. నీవు అమాయికుడవు రామచంద్రుడివంటివాడివి. నిన్ను తీసుకవెళ్ళి ఆరాక్షసికిచ్చి పెళ్ళిచేశాను. (కళ్ళుతుడుచుకొని) అయ్యో! రామా! యేంకట్లు? యేంబొట్లు? యేమిసిగలు? యేమిపువ్వులు? యేమిజాకట్లు? దీని షోకుమండా!

నిండాపన్నెండేళ్లు వెళ్లాయోలేదో అప్పుడే యింతషోకెల్లా నేర్చిందో. సానింట్లో పుట్టవలసిందేకాని సంసారింట్లో పుట్టాలసిందికాదురా నాయినా! నీకెక్కడదొరికిందో. ముందు ఆబస్త్రీపిల్లమనకొద్దో అంటే 2000 వేలు కట్నానికాసించి మీనాన్నే చేశారోయి. తండ్రీ! మనం దానితోవేగలేకుండా వున్నాము. నడుస్తూనడుస్తూకూడా పాటలు పాడుతుందిగదా. సిగ్గేనాలేదు. ఏపిల్లలేనా పాడమంటే పాడకుండా యెంతోబెట్టుచేస్తారు. ముచ్చటవుతుంది. అల్లాకాదిది. పాడమన్న దేతడవు. సిగ్గుంటేనా? ఇంతసిగ్గుమాలినదాన్ని యెక్కడాచూడలేదు. మొన్నచెరువుదగ్గర నాపేరుచెప్పి అవిడకోడలు యెంచక్కాపాడింది వాళ్ళయింట్లో అని యెవ్వరో కాపులు చెప్పుకుంటే తల పొట్టలోపెట్టుకున్నాను. నాకెంతో సిగ్గనిపించింది ఇది-అంతా నాకర్మం-నీవుచెప్పి నీవొద్దిలోవుంచుకొనే తెలివితేటలు నీకు లేందే అదెల్లాలొంగుతుంది-మానాడు మేము గట్టిగామాట్లాడైనాయెరగము - యెల్లాచేసుకుంటావో నీయిష్ట మబ్బాయి! జాగ్రత్త.

రామబ్రహ్మముభార్య కాపురానికి రాకుండానే తండ్రి చచ్చిపోయాడు. తల్లివద్ద రామబ్రహ్మానికి భయమెక్కువ. అవిడచెప్పినమాటకి యెదురుచెప్పడు. ఆమెవాక్యములు వేదవాక్యము లతనికి. కామాక్షమ్మ పైకి మాట్లాడనట్లే వుంటుంది కాని ఆమె అనుకున్నపని సాధించితీరుతుంది. అసాధ్యురాలు అంతాకృత్రిమమే కొడుకు అమాయకుడుకదాఅని కోడలిమీద లేనిపోనివి కల్పించిచెప్పి కొట్టిస్తూవుంటుంది. వాళ్ళదొడ్డిలో వేపచెట్టువుంది. అక్కడికి తీసుకువెళ్ళటం. ఇటికెలురెండు వేసుకు కూర్చోటం. తల్లీకొడుకులు తలలోతలలు పెట్టుకొని నాలుకలు కొరుక్కోటం. తర్వాత ముసుగుసవరించుకుంటూ చల్లగా ఆమె యింట్లోకిరావటం. ఆఅబ్బాయి వెళ్ళి ఆఅమ్మాయి తాళింపట్టడం-యిది రోజూ మామూలు-అట్లాజరుగుతూన్నా అప్పుడప్పుడామె కొడుకుమీద కోప్పడి-నీవు చచ్చేవు. నీకు ధైర్యములేదు-అంతానాసొమ్మ తినేవారేగాని నామాట వింటూరా? నీకు నే విషమైపోయాను-పెళ్ళాంవలలో చిక్కుకుపోయావు-నీవు దద్దమ్మవు-అనిసాధింపారంభిస్తుంది-యికపద్మావతి సంగతేమిటంటే పద్మావతి. చిన్నపిల్లప్పుడే 6 సంవత్సరముల వయస్సునందే ఆఅమ్మాయి పితామహిచూడాలని వివాహంచేశేశారు. చాలాడబ్బుగల సమ్మంధమేయేరారు-రెండువేలు కట్నంయిచ్చి లాంచనములు జరిపి వైభవముగా పెండ్లిచేశాడామెతండ్రి. పద్మావతి పన్నెండుసంవత్సరముల వ్యక్తురాలై అత్తవారింటికి వచ్చింది-ఈపన్నెండుసంవత్సరముల పిల్లకి సంసారములో ఎంతఅనుభవముంటుందో వూహించుకుందాము. పైగా కాపురానికి వచ్చేవరకూ స్కూలుకువెళ్ళి చదువుకుంటూవుందిగాని యింతచాకిరీచేసి బండలాపడి వుండేదికాదు-ఆఅమ్మాయి మంచితెలవిగది. పాట, పద్యం, చదువు, కుట్టు అన్నీబాగావచ్చును. చిన్నపిల్ల అయినా భారతభాగవతాలు చక్కగాచదివి తండ్రిని నాయినమ్మని కూర్చోపెట్టి అర్థంచెప్పేది. ఉన్నవూరు బస్తీయేగనక అనేకగ్రంథాలు తండ్రితెప్పించి చదివించేవాడు కావుననే పద్మావతి పన్నెండుయేళ్ళకే మంచిజ్ఞానంసంపాదించింది-అత్తవారింట్లో ఈఆమ్మాయి చాలాఅణుకువుగా వుంటుంది కాని అత్తగారిక్కి నచ్చలేదు-పెనిమిటి తెల్వితక్కువవాడు. పైగా తల్లియెంతచెప్పితే అంత. ఆఅబ్బాయికి పెండ్లయి కొంతకాలానికి మశూచికంవచ్చి కంట్లోకాయికూడావేసింది. మనిషి వికృతంగా మారిపోయాడు. అసలే తెల్వితక్కువ. అందులో ఆ కాస్తతెలివీకూడా పోయింది. పద్మావతి సంగీతంపాడితే వాళ్ళకి అసహ్యాం. అవును శ్రావ్యముగ పాడుతూంటే శ్రావణానందముగా వింటానికికూడా పెట్టి పుట్టాలేగదా. పద్మావతి అత్తగారింటికి వచ్చిందిమొదలు పుస్తకం చేతపట్టలేదు-అల్లలేదు, కుట్టలేదు, పాడలేదు. ఇవ్వన్నీ యిక్కడ పనికిరావు. (పందిబురదమెచ్చు పన్నీరుమెచ్చునా) అని ఆఅత్తకి ఈకోడలునచ్చదు. నిజానికి పద్మావతి మంచితెలివిగలది గనకనే ఆయింట్లో నెగ్గుకోస్తోంది. పెనిమిటి తెలివితక్కువ అయినాఅత్తగయ్యాళి అయినా

తనకేవిధమైన సంతోషసౌఖ్యములు లేకపోయినా వక్కమాటైనా పుట్టినింటికి తెలుపకుండా పెనిమిటంటే చాలాభక్తితో వుంటోంది-అమ్మలక్కలంతా పద్మావతికేమమ్మా అదృష్టవంతురాలు యేతెల్వితక్కువవాడైతే మాత్రమేమి అన్నవస్త్రాలకులోటులేదు, కోపమొచ్చి రెండుకొట్టినా ఆపేక్షగానే వుంటాడమ్మా! అత్తగారు మహాసాధు అని చెప్పుకుంటారు.

మధ్యాహ్నము మూడుగంటలైంది. రామబ్రహ్మం కుర్చీలోపడుకున్నాడు తల్లిచెప్పినమాటలు తలుస్తూ. భార్యనెల్లా బాధించడమా అనికాబోలు ఆలోచిస్తున్నాడు. అమాయకురాలు పద్మావతికి ఈసంగతి యేమి తెలుస్తుంది? మామూలుగా కాఫీకాచి తీసుకువచ్చింది. రామబ్రహ్మంకి భార్యనిచూడగానే వళ్లువుడికింది-కోపంగా కళ్లెర్రచేసి 'మధ్యాహ్నంకూడా కాఫీయెందుకుచేసేవు?' అన్నాడు.

ప:—రోజూచేసినట్లే ఈవేళాచేసేను-మొన్న ఒకరోజు లేకపోతే మీకు తలనొప్పివచ్చిందికదూ. అప్పటి నుంచి పాలువుంచుచున్నాను.

రా:—(యింకాకోపంతో) నాతలనెప్పిజోలెందుకు? నాకక్కరలేదు. కాఫీ నీవేత్రాగు. నాకని వంకపెట్టి నీవుత్రాగుతూ—నీఆటలు బాగాలేవు. నీవు రేపటినుంచి కాఫీమానేసెయ్యి. నాకుకావలిస్తే నేచేసుకు తాగుతాను.

ప:—అట్లాగే, రేపటినుంచి చెయ్యను. ఈరోజుకి పుచ్చుకోండి.

రా:—ఈ ఆటలెన్నాళ్లు ఆడతావోచూస్తాగా నీసంగతంతా తెలిసిందిలే. నాకక్కరలేదు. నాయెదుటనుంచి అవతలకుపో.

పద్మావతి మాట్లాడలేదు. ఆమెకి యిటువంటికోపము యెప్పుడూ మామూలే. అక్కడనుంచుంటే బాజాలుపడతాయిని కాఫీ అక్కడవుంచి వెనక్కితిరిగింది.

రా:—వెళ్లమంటే మాట్లాడకుండా వెడుతున్నావో యెంతనిర్లక్ష్యము. నీ నిర్లక్ష్యమంతా అణుస్తాలే! నిన్ను పెళ్లిచేసుకోటంవల్ల నాపరువుప్రతిష్టలు పోతున్నాయి-దరిద్రమొఖానివి దాపరించావు.

మగనికి యెందుకో గట్టికోపంవచ్చిందని పద్మావతికి తెలిసింది-దగ్గరగావచ్చి 'నామీదేనాకోపం యెందుకో చెప్పండి-నావల్ల నేరముంటే తెలియజెప్పితే దిద్దుకుంటాను అంతేగాని కోపంచేయటం అనవసరం-' అంది.

"ఛీ! వూరుకో, యింకామాట్లాడుతున్నావు. నీవల్లనేరంవుంటేచెప్పాలా? నాకంట్లోకాయని, నేను అందంగాలేనని నన్ను అగౌరవంగా చూస్తున్నావుట. బొత్తిగా సిగ్గులేకుండా వుంటున్నావుట. సిగ్గులేక యింకా కారణం చెప్పమంటావు. ఇటువంటి వేషాలువేశావంటే డొక్కచీరేస్తా.'

"నేను యేమీయెరగను. మిమ్ముల నగౌరవంగాచూచేదీ, గౌరవంగాచూచేదీ మీకు తెలియదూ? మీతో యీ అసత్యం కిట్టక యెవ్వరో..."

"ఆ తెలుస్తూనేవుంది నీ ప్రవర్తన. అందుకనే అంటున్నాను. నీవు చక్కనిదానవని చదువుకున్న దానివని తెల్విగలదానవని గర్వము. అన్నీ మా అమ్మే చెప్పింది. నేనూ చూస్తూవున్నానుయెందుకుఅని వూరుకుంటే మీరిపోయావు."

"నన్ను అన్యాయంగా ఎందుకు అంటారు. నేనుచేసిన తప్పేమిటో మీయెదుట మీఅమ్మగార్ని అడుగుతానురండి రోజూ యీ బాధపడలేకుండావున్నాను. ఇరవదినాల్గుగంటలూకోపమేనా? నాకర్మం."

"ఇదిగో నోరుముయ్యి. భయంభక్తీలేదు నీకు. ఎదిరించి మాట్లాడుతావు. మాఅమ్మని అడుగుతావా సిగ్గులేక? ఫో. అవతలకుఫో. నిన్నుచూస్తే నా వళ్లుమండుతుంది."

చేతులుపట్టుకుని "యిదిగో వూరికే నన్నుతిట్టకండి. మిమ్మల్ని అగౌరవంచేస్తే నాకు అగౌరవంకాదూ? నావల్లతప్పంటే క్షమించండి. వాకిట్లోఅత్తగారున్నారు. మనముపోట్లాడితే బాగుండదు. కాఫీపుచ్చుకోండి" అని కప్పు దగ్గరగా పెట్టింది.

"ఛీ! గాడిదా మాట్లాడుతావు. నీకాఫీ యెవరిక్కావాలి" అనిచేత్తో కప్పుతీసుకుని పద్మావతి మొగాన్ని వేసికొట్టేడు—పాపము పద్మావతి నుదురు గాజు పెంకులు చీరుకుని నెత్తురుగారింది. వేడికాఫీకి ముఖముకాలిపోయింది-ఆమెకి దుఃఖమాగలేదు. కూలబడియేడ్చింది-రామబ్రహ్మం కోపం యింకా రెండుదెబ్బలు వీపుమీద కొడితేగానిపోలేదు. తర్వాత యీవలకొచ్చి పళ్లు పటపటకొరుకుతూ వెళ్లిపోయాడు. ఈచరిత్ర కామాక్షమ్మ వత్తులు చేసుకుంటూ వాకిట్లో కూర్చుని వింటూనేవున్నది.

పద్మావతి యిదే మొదటిసారి అత్తింటికి రావటం. శ్రావణమాసంగదా అనితండ్రి తీసుకు వెళ్లటానికి వచ్చాడు. కాని పంపిచటం మాతాపుత్రులకి యిష్టంలేదు. అత్తగారినడిగితే కుఱ్ఱాడినడగండీ అంది. కుఱ్ఱాడినడిగితే మాఅమ్మయిష్టంఅన్నాడు. పద్మావతి తండ్రితోవెడతానని యేడ్చింది పాపము. తండ్రి ధైర్యంచెప్పి ఈతల్లికొడుకుల సందున యేసంగతి తేలనందున వచ్చినత్రోవనే చక్కాపోయాడు. శ్రావణమాసంలో పద్మావతికి పసుపుకుంకానికైనా వెళ్లనీయలేదు-మంగళవారం చీరెకట్టుకుని పేరంటానికి వెడతానని పెనిమిటిని అడిగింది. ఆయన 'వేషమేశావే మాఅమ్మతోచెప్పేవా?' అన్నాడు. 'ఆచెప్పేను. ఆమె మాట్లాడలేదు. మీరువెళ్లమంటె వెడతా' అంది-'అట్లాగా మా అమ్మ మాట్లాడకపోతే నేనూ మాట్లాడను నీవూ వెళ్లక్కరలేదు పెద్దపట్టుచీరె సింగారించావుగాని యీపాటికి చీరెదాచుకో. ఇల్లాగే బట్టలన్నీ పాడుచేస్తున్నావని మాఅమ్మ చెప్పింది. కాని నేను వూరుకున్నాను. ఫో. విడిచిరా. చీరెదాచుకో' అన్నాడు. పద్మావతికళ్లనీరు కారుస్తూ చీరె తీసికొనివెళ్లి పెనిమిటి పెట్టిలోదాచిపెట్టింది. దెబ్బలు తగలలేదుకదా అనిసంతోషించింది పాపము-పద్మావతి తండ్రివచ్చి వెళ్లినప్పటినుండి ఆమెకికోడంత్రికము యెక్కువైపోయింది. పైగా తండ్రి యింటికిచేరి వుత్తరంరాస్తే యీఅమ్మాయి చదివిందిట. 'అదిగో వాళ్లనాన్న వ్రాసినవుత్తరంచదివింది. జవాబుకూడావ్రాస్తుందేమోరా నీతోచెప్పకుండా. యిటువంటి వుత్తరాలు చదవటంవ్రాయటం మాయింట్లోపనికిరావని ఖండితంగా చెప్పేశెయ్యి' అనితల్లిగారి ఆర్డరుఅయింది. ఆరోజు జ్వరంతో పడుకుంది పద్మావతి. వైద్యుడు, మందు లేదు సరికదా పెనిమిటి 'మీనాన్నవ్రాసిన వుత్తరం చదివేవుట నీవుదొంగతనంగా. నాతో చెప్పకుండా జవాబుకూడా వ్రాశావుట. నీవెందుకువ్రాశావు?' అనిఅడిగేడు. 'నేనుచదివినిమాటనిజమేకాని జవాబువ్రాయలేదు-ఆవుత్తరం మానాన్న చేరినట్లు మీకేవచ్చింది. మీరింట్లోలేరుగదాఅని కార్డుకదాఅని నేను చదివేను అంతేకాని నేనేమీవ్రాయలేదు'అంది. అంతే యింకేముంది-ఆ అమాయకురాలిని ఆ జ్వరపీడితను పట్టుకుని కొట్టేశాడు. కొట్టియీవలకొచ్చి గదితలుపు పైన గొళ్లెంపెట్టి చక్కాపోయాడు. దెబ్బలకి తాళలేక పద్మావతి పడిపోయింది. స్పృహతప్పిపోయింది. సాయంకాల మాయెను తెలివివచ్చింది-దీపాలుపెట్టేరు. తన గదిలోకూడా గుడ్డిదీపముండటం తెలుసుకొంది. మంచినీళ్లుఅనినెమ్మదిగాఅంది-కాని ఆస్వరము-నాలుకనుండి, యీవలకురాలేదు. గొంతుఆరుకుపోయింది. మంచినీళ్లుయిచ్చేవార్వెరు? దెబ్బలుకొట్టినతర్వాత దీపంపెట్టటానికి అత్తమాత్రం ఆగదిలోనికివచ్చి దీపంపెట్టి వెళ్లిపోయింది. పద్మావతి అట్లాగే నెమ్మదిగా ప్రాకి తలుపుతెరవబోయింది. కాని ఆవలగొళ్లెముంటే యెట్లావస్తుంది? రాలేదు. అంత నాఅమాయకురాలు కళ్లనీళ్లు కారుస్తూ తల్లిదండ్రులని తలుచుకుని-భగవంతుని ధ్యానంచేస్తూ, దీపందగ్గరకు వెళ్లింది-కిరసనాయిలు బట్టనిండాబోసుకుని అంటించుకున్నది. కొద్దిసేపటికీ జ్యోతిఆరిపోయింది. నిశ్శబ్దం-నిశీథం-నిర్మలం. పద్మావతి కష్టాలు నాటితో గట్టెక్కినాయి. కామాక్షమ్మ కొడుక్కి మళ్లీపెళ్లి చేయాలని ప్రయత్నంచేస్తూంది-కానిపిల్లనిచ్చేవారు భయపడుతున్నారు. మెత్తనికత్తి, మేకవన్నెపులి—యీమెతో సంబంధ మెవరు చేస్తారు?